ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
మంగళవారం 24 సెప్టెంబరు 2024

పత్తి ధర ధమాల్

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 23 : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు సోమవారం భారీగా పతనమయ్యాయి. క్వింటాలు గరిష్ఠంగా రూ.7769కు పడిపోయింది. ఒక్క రోజులోనే క్వింటాకి 500పైగా ధర పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని కన్నీరు కారుస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి గింజల ధరలు, దూది ధరలు పతనం కావడం వల్లే ధరలు పతనమైనట్లు తెలుస్తోంది. 12,640 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4,211, గరిష్ఠ ధర రూ.7,789, మధ్యస్థ ధర రూ.7,476 పలికింది.



దారి మళ్లుతున్న ఎరువు

కర్నూలు నగరంలోని బస్టాండు సమీపంలో ఒక హోల్‌సేల్ వ్యాపారికి సంబంధించిన బిల్డింగ్‌కు ఉన్న బోర్డుపై రిటైల్ వ్యాపారం కూడా నిర్వహిస్తున్నట్లు రాశారు. అయితే ఈ హోల్‌సేల్ వ్యాపారి తనకు కేటాయించిన ఎరువులన్నీ కర్నూలు నగరంలోని ఒక బడా హోల్‌సేల్ వ్యాపారికి అప్పగిస్తూ బస్తాపై కొంత కమీషన్ తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. హోల్‌సేల్ వ్యాపారి ఎక్కడా కూడా ఒక్క రైతుకు కూడా రిటైల్ షాపు ద్వారా ఎరువులు అందించడం లేదు. ఇటువంటి హోల్‌సేల్ వ్యాపారులు కర్నూలు, నంద్యాల జిల్లాలో 30 మంది దాకా ఉన్నా.. వీరంతా కర్నూలు నగరంలోని ఒక బడా హోల్‌సేల్ వ్యాపారి చెప్పినట్లుగా పని చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ఎరువుల రేక్ పాయింట్ నుంచే పక్కదారి
- చక్రం తిప్పుతున్న హోల్‌సేల్ డీలర్, జేడీ కార్యాలయ అధికారి
- కేటాయింపులు కాగితాల్లోనే..
- అక్రమ వసూళ్లపైనే అధికారుల ధ్యాస
- యూరియా, డీఏపీ కృత్రిమ కొరత
- అధిక ధరకు విక్రయాలు?

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 23: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అవసరం. ఎరువుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ డీలర్లతోపాటు వ్యవసాయ శాఖ అధికారులు జేబులు నింపుకునే కార్యక్రమమే తమ డ్యూటీగా పని చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎరువొస్తే చాలు.. తమ జేబులు నిండినట్లేనని డీలర్లు సంబరపడుతుంటే.. మామూళ్లకు కొదువే ఉండదని అధికారులు పేరాశ పడుతున్నారు. ఎరువుల సప్లయ్‌కు సంబంధించి జేడీ కార్యాలయంలో ఓ అధికారి చక్రం తిప్పుతుంటే.. జిల్లా కేంద్రంలోని ఓ హోల్‌సేల్ వ్యాపారి రిటైల్ డీలర్లకు ఎంత ఎరువు ఇవ్వాలో నిర్ణయం తీసుకుంటుండటం దారుణం. వాస్తవంగా ఎరువులు హోల్‌సేల్‌తోపాటు ఆయా రిటైల్ డీలర్లకు ఎంత మొత్తంలో ఇవ్వాలో జేడీ కార్యాలయంలోనే నిర్ణయం తీసుకుంటారు. అయితే ఈ నిబంధన ఉమ్మడి జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. హోల్‌సేల్ డీలర్‌గా గుర్తింపు పొందిన ఓ బడా వ్యాపారి తానే అన్నీ తానై ఏ రిటైల్ డీలర్లకు ఎంత మొత్తంలో ఎరువులు ఇవ్వాలో నిర్ణయం తీసుకోవడం దారుణం. ప్రధానంగా ఎరువులు మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్‌బీకే కేంద్రాలకు చేర్చి స్థానికంగా రైతులకు ఇవ్వాల్సి ఉంది. అయితే.. ఆయా గ్రామాల్లోని రాజకీయ నాయకులు మార్క్‌ఫెడ్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో అర్హులైన రైతులకు ఎరువులు అందకపోవడంతో బయటకు వెళ్లి డీలర్ల వద్ద అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. యూరియా, డీఏపీ ఎరువులపై కృత్రిమ కొరతను సృష్టించి పెద్దఎత్తున రూ.200 నుంచి రూ.300ల దాకా అధిక ధరను రైతుల నుంచి వసూలు చేస్తున్నారు.

ఎరువొస్తే జేబులు నిండినట్లే..

కర్నూలు, నంద్యాల జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో మూడు లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా. సెప్టెంబరు 10వ తేదీ వరకు దాదాపు రెండు జిల్లాల్లో కలిపి ఒకటిన్నర లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేయాల్సి ఉండగా 90 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే సరఫరా జరిగింది. దీంతో ఇదే అదునుగా డీలర్లు కృత్రిమ కొరతను సృష్టించి బస్తాపై రూ.100 నుంచి రూ.200 దాకా రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు వెయ్యి మంది దాకా రిటైల్ డీలర్లు ఉన్నారు. హోల్‌సేల్ డీలర్లు 30 మంది దాకా ఉన్నారు. నిబంధనల ప్రకారం యూరియా, డీఏపీ ఇతర కాంప్లెక్స్ ఎరువులు ఆయా కంపెనీల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చిన సమయంలో రీటైల్ డీలర్లకు ఎంత మొత్తంలో ఏ ఎరువులు ఇవ్వాలో జేడీ కార్యాలయంలోని ఒక అధికారి జాబితాను తయారు చేస్తారు. అయితే.. ఆ జాబితాలో పేర్కొన్న డీలర్లకు ఎరువులు అందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జేడీ కార్యాలయంలో తయారు చేసిన జాబితా ప్రకారం రైల్వేస్టేషన్‌కు ఎరువుల రేక్ పాయింటు వచ్చినప్పుడు జిల్లా కేంద్రంలోని వ్యవసాయాధికారి రేక్ పాయింటు వద్దకు చేరుకుని సక్రమంగా ఎరువులు రీటైల్ డీలర్లకు అందించాల్సి ఉంటుంది. అయితే రెండు మూడేళ్ల నుంచి రేక్ పాయింటు వద్ద అధికారి పర్యవేక్షణ లేకుండా పోయింది. ఎప్పుడు ఏ ఎరువు రేక్ పాయింటు వద్దకు చేరుతుందో జేడీ కార్యాలయం నుంచి ఆయా డీలర్లకు సమాచారం అందించాల్సిన అధికారి అలా చేయకుండా హవా నడిపిస్తున్న కర్నూలు నగరంలోని హోల్‌సేల్ డీలరుకు సమాచారాన్ని చేరవేస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో జేడీ కార్యాలయంలో నిర్ణయించిన జాబితా ప్రకారం కాకుండా హోల్‌సేల్ వ్యాపారి సూచించిన డీలరుకే ఎరువులు చేరుతున్నాయి.

యూరియా, డీఏపీ కావాలంటే అధిక ధర చెల్లించాల్సిందే

ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు యూరియాతో పాటు డీఏపీ, పొటాష్ ఎరువులు కావాలంటే లింకు వస్తువులు తీసుకోక తప్పని పరిస్థితి. రీటైల్ డీలర్లు లింకు వస్తువులు రైతుల చేత కొనుగోలు చేయించలేమంటూ మొత్తుకుంటున్నా హోల్‌సేల్ వ్యాపారి వినిపించుకోవడం లేదు. కోరమాండల్ కంపెనీకి చెందిన ఎరువులు కావాలంటే ఎన్‌పీకే19-19-19 అదేవిధంగా ఎన్‌పీకే14-35-14 రకంతోపాటు 22-00-11-15-15-15 ఎన్‌పీకే10-26-26 రకం ఎరువులనే తప్పనిసరిగా తీసుకోవాలని హోల్‌సేల్ డీలరు ఆదేశిస్తున్నట్లు రీటైల్ డీలర్లు చెబుతున్నారు. జిల్లాలోని కౌతాళం, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆస్పరి, గోనెగండ్ల, హాలహర్వి, గూడూరు, మంత్రాలయం, వెల్దుర్తితోపాటు నంద్యాల జిల్లాలో నందికొట్కూరు, నంద్యాల, బనగానపల్లె, డోన్, పాణ్యం, ఆత్మకూరు తదితర నియోజకవర్గాల్లో ఎరువుల దుకాణాలు దాదాపు వెయ్యి దాకా ఉన్నాయి. డీలర్ లైసెన్సును రెన్యువల్ చేయాలన్నా, కొత్త లైసెన్సులు ఇవ్వాలన్నా జేడీ కార్యాలయంలోని అధికారితోపాటు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఎరువులను రైతులకు సక్రమంగానే అందిస్తున్నాం

జిల్లాలో ఎరువుల కొరత లేదు. కొంత మంది డీలర్లు కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు మాకు ఫిర్యాదులు వస్తున్న మాట వాస్తవమే. అయితే రైతుల ఫిర్యాదులను వెంటనే పరిగణనలోకి తీసుకుని ఎమ్మార్పీ ధరకే అన్ని ఎరువులను అందిస్తున్నాం. ఎక్కువ ధర వసూలు చేస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి వెంటనే సంబంధిత డీలరుపై చర్యలు తీసుకుంటాం. జేడీ కార్యాలయం నుంచే ఏ డీలరుకు ఎంత ఎరువు ఇవ్వాలో జాబితాను తయారు చేస్తాం.. ఆ జాబితా ప్రకారం రేక్ పాయింటు వద్ద ఎరువులను ఆయా డీలర్లకు అందేలా పర్యవేక్షణాధికారి దగ్గరుండి చూస్తున్నారు.

- వరలక్ష్మి, వ్యవసాయశాఖ జేడీ

సంవత్సరానికి రూ.5 వేలు మామూళ్లు

జేడీ కార్యాలయంలోని అధికారులు తన కనుసన్నల్లోనే ఉండేలా హోల్‌సేల్ వ్యాపారి చక్రం తిప్పుతున్నట్లు రిటైల్ డీలర్లు ఆరోపిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఒక్కో రిటైల్ డీలరు నుంచి రూ.5 వేల చొప్పున హోల్‌సేల్ డీలర్ వసూలు చేసి ఆ మొత్తాన్ని జేడీ కార్యాలయంలోని అధికారికి ముట్టజెబుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. వివిధ సందర్భాల్లో జేడీ కార్యాలయ అధికారితోపాటు మిగిలిన వ్యవసాయాధికారులకు అవసరం ఉన్నప్పుడల్లా డబ్బును ఈ హోల్‌సేల్ వ్యాపారే సర్దుబాటు చేస్తున్నట్లు తెలిసింది.



రేక్ పాయింట్ నుంచి లారీల ద్వారా తరలిస్తున్న ఎరువులు



తిరుమలను అపవిత్రం చేసే కుట్ర

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 23: తిరుపతి, తిరుమల ఖ్యాతిని అపవిత్రం చేసి.. అక్కడకు ఎవరూ వెళ్లకుండా చేయాలని జగన్ బ్యాచ్ కుట్ర చేసిందని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని బైరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి లాంటి వ్యక్తులకు కీలక బాధ్యతలు అప్పగించడం ఏమిటని ప్రశ్నించారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి విజయనగరం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, మంత్రాలయం వరకు వందల ఆలయాలు, విగ్రహాలను జగన్ బ్యాచ్ ధ్వంసం చేసిందని ఆరోపించారు. వీటన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఏడు కొండలపై వివాదాస్పద జీవోను జారీ చేశాడని, ఆ అంశాన్ని వెలుగులోకి తెచ్చింది తానేనని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి అన్యమతస్థుడని, తిరుమల లడ్డూ విషయంలో జగన్ మహాపచారం చేశాడని దుయ్యబట్టారు. ఇలాంటి దుర్మార్గులు మరోసారి అధికారంలోకి వచ్చి ఉంటే వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని తీసేసి ఆ స్థానంలో వైఎస్ విగ్రహం పెట్టేవారేమోనని సందేహం వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు వేముల శ్రీధర్, నారాయణరెడ్డి, కాకర వాడ చిన్న వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23: స్వర్ణాంధ్ర విజన్-2047 ప్లాన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. స్మార్ట్ ఫోన్ నుంచి Http://swarnandhra.ap.gov.in/suggestions లింక్‌తో వచ్చే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఆలోచనలు, సలహాలను పంచుకోవాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోతోపాటు సంతకంతో కూడిన సర్టిఫికెట్ అందుతుందని కలెక్టర్ తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ అనంతరం ముందుగా పేరు, మొబైల్ నంబర్ నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ అనంతరం ధ్రువీకరించాక జిల్లా ఎంపిక, వయసు, లింగ నమోదు చేయాలి. అనంతరం వృత్తిని నమోదు చేసిన ఈ మెయిల్, చిరునామాను నమోదు చేసి, అభిప్రాయాలు, సలహాలను తెలియజేయవచ్చని తెలిపారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరిస్తాం: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జి.బిందు మాధవ్

కర్నూలు, సెప్టెంబరు 23: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 133 ఫిర్యాదులు వచ్చాయి. హైదరాబాదుకు చెందిన బెస్ట్ గ్రూప్ ఆఫ్ సర్వీసెస్ కన్సల్టెంట్ ఉద్యోగం పేరుతో మోసం చేశారని కర్నూలు ఉద్యోగనగర్‌కు చెందిన చిన్న కృష్ణ ఫిర్యాదు చేశారు. షుగర్ ఫిట్ సర్వీస్ కంపెనీ పేరుతో మోసం చేసి బజాజ్ ఫైనాన్స్ కార్డు నుంచి రూ.30వేలు కాజేశారని కర్నూలుకు చెందిన పరమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

- ఆయిల్ మరకలకు తుడవడానికి, క్లాత్ సప్లై చేయడానికి రైల్వే టెండర్ ఇప్పిస్తామని చెప్పి కర్నూలు ఇండస్ట్రియల్ ఎస్టేట్ చెందిన శ్రీనివాసులు రూ.16 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు, కల్లూరు చెందిన సుంకన్న ఫిర్యాదు చేశారు.
- కర్నూలు దిన్నెదేవరపాడు లక్ష్మీ వెంకటేశ్వర వెంచర్స్‌లో రూ.35 లక్షలకు ఇల్లు కట్టించి ఇస్తామని చెప్పి డబ్బులు తీసుకుని ఇంత వరకు ఇల్లు కట్టించకుండా మోసం చేశారని కోడుమూరు చెందిన అరుణ ఫిర్యాదు చేశారు.
- తన పొలంలోకి ప్రతాప్ రెడ్డి అనే వ్యక్తి అక్రమంగా ప్రవేశించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ, పొలంలోకి వెళ్లనీయకుండా కంపౌండ్‌వాల్ వేశాడని చర్యలు తీసుకోవాలని వెల్దుర్తి వెంకటాపురానికి చెందిన పుల్లయ్య ఎస్పీని ఆశ్రయించాడు.
- ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు సమీపంలో మద్యం దుకాణానికి టెండర్ ఇప్పిస్తామని చెప్పి బుధవారపేటకు చెందిన షేక్ సలీమాబేగం, షేక్ మహబూబ్ బాషా, శివకుమార్‌రావులు రూ.98 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు సంతోష్‌నగర్‌కు చెందిన హరికృష్ణ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో 129 మందికి బదిలీ

కల్లూరు, సెప్టెంబరు 23: జనరల్ బదిలీల్లో భాగంగా నిబంధనల మేరకు విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఉద్యోగులకు బదిలీ ఆర్డర్లను జారీ చేశారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు గైడ్‌లెన్స్ ప్రకారం ఉమ్మడి కర్నూలు సర్కిల్‌లోని అకౌంట్స్, ఇంజనీర్లు, సీనియర్ అసిస్టెంట్ దిగువ స్థాయి ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చామని ఎస్‌ఈ స్పష్టం చేశారు. మ్యూచ్‌వల్, ఐదేళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగులు, మెడికల్ గ్రౌండ్ కింద ఇచ్చిన అభ్యర్థనలను పరిగణలోకి తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగా మొత్తం 129 మందికి బదిలీ ఆర్డర్లు ఇవ్వగా ఏఈఈ, ఏఈ-22, జేఈ-24, జేఏఓ-7, సీనియర్ అసిస్టెంట్-49, జూనియర్ అసిస్టెంట్-17, టైపిస్ట్-2, ఓఎస్‌ఓ-1, జేఎల్‌ఎం గ్రేడ్-2-6, వాచ్‌మన్-1 ఉన్నాయని ఎస్‌ఈ తెలిపారు. అదేవిధంగా తిరుపతి కార్పొరేట్ ఆఫీసు నుంచి సీఎండీ సంతోషరావు పలువురు ఏఈలు, ఏడీఈలు, డీఈలకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు.

పోలీసు కవాతులా..!



మోడల్ స్కూల్ ముందు నిలిచిన మురుగు నీరు

ఆలూరు, సెప్టెంబరు 23 : రహదారికి ఇరువైపులా క్యూ పద్ధతిలో.. పోలీసు కవాతు మాదిరిగా ముందుకు సాగుతున్నారు. ఎవరైనా చూస్తే ఈ పిల్లలు ఎంత పద్ధతిగా వెళ్తున్నారనేలా నడక సాగిస్తున్నారు. వారి వరుస క్రమం ఆ విధంగా కనిపిస్తోంది. అయితే అసలు విషయం అక్కడున్న రహదారిని చూస్తే అర్థమవుతుంది. చెరువును తలపించేలా నీటితో నిండి ఉండడంతో వరుసగా వెళ్లడం వారికి తప్పని పరిస్థితి అయింది. ఆ మేరకు రోడ్డుకిరువైపులా క్యూలో నడుచుకుంటూ స్కూల్‌కు వెళ్తున్నారు. ఆలూరు పట్టణంలోని మోడల్ స్కూల్ ముందు రోడ్డు పరిస్థితి ఇది. చిన్న పాటి వర్షానికి రోడ్డుపై నీరు చేరడంతో రాకపోకలు సాగించడానికి విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డ్రెయిన్లు నిర్మించినా మురుగు నీరు ముందుకు సాగక రోడ్డుపైకి చేరుతోంది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ మార్గం గుండా వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారింది.

ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు

- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 23: పేదల ఆకలి తీర్చాలన్న లక్ష్యంతోనే తమ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట, కొండారెడ్డి బురుజు సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా ప్రారంభించారు. అనంతరం మంత్రి, కలెక్టర్ స్వయంగా ప్రజలకు అల్పాహారాన్ని వడ్డించడంతోపాటు వారితో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. కర్నూలు నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రదేశాల్లో మూడు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాంటీన్‌ను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పేదలు పస్తులు ఉండకూడదన్న లక్ష్యంతో ఐదు రూపాయలకే నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో అన్ని క్యాంటీన్లను తీసేయడంతో పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 సాధించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాయన్నారు. కలెక్టర్ రంజిత్‌భాష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో 5 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైన పనుల కోసం నగరానికి వచ్చే పేదలకు అన్నక్యాంటీన్ల ద్వారా రుచికరమైన భోజనం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సోమిశెట్టి నవీన్, సత్రం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి భరత్, కలెక్టర్ రంజిత్‌బాషా





భోజనం వడ్డిస్తున్న... అనంతరం అల్పాహారం చేస్తున్న మంత్రి, కలెక్టర్

గడువు దాటకుండా పరిష్కరించండి

ప్రజా ఫిర్యాదులపై కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23: ప్రజా ఫిర్యాదులను గడువు దాటకుండా పరిష్కరించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఆదోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఒక దరఖాస్తు పరిష్కారంలో గడువు దాటిందని, గడువులోపు పరిష్కరించకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రీ ఓపెన్‌కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ పత్తికొండ ఆర్డీవో కార్యాలయాల్లో 4, ఆదోని ఎంపీడీవో కార్యాలయంలో 2 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో 7, విద్యాశాఖలో 6, ఉపాధి కల్పన శాఖలో 1, బీసీ సంక్షేమ శాఖలో 1, పౌర సరఫరాల శాఖలో 3, గురుకులం కోఆర్డినేటర్, వ్యవసాయ శాఖలో ఒక్కో దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

కర్నూలు డీటీసీగా శాంతకుమారి

కర్నూలు, సెప్టెంబరు 23: కర్నూలు ఉప రవాణా కమిషనర్(డీటీసీ)గా శాంతకుమారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈమె ఏలూరు డీటీసీగా పని చేస్తున్నారు. కర్నూలు డీటీసీగా ఉన్న శ్రీధర్‌ను కాకినాడ డీటీసీగా బదిలీ అయ్యారు. అలాగే కర్నూలు ఆర్టీవో రమేష్‌ను రంపచోడవరం ఆర్టీవోగా బదిలీ కాగా, రాయచోటి ఆర్టీవోగా ఉన్న లాల్‌సింగ్ చౌహాన్‌ను కర్నూలు ఆర్టీవోగా నియమితులయ్యారు. కర్నూలు ఎంవీఐ మనోహర్ రెడ్డిని అనంతపురానికి బదిలీ చేశారు.

ట్రిపుల్ ఐటీ తాగునీటికి రూ.22 కోట్లు విడుదల

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 23: ట్రిపుల్ ఐటీ తాగునీటికి ప్రభుత్వం రూ.22 కోట్లు విడుదల చేసింది. నగర శివారులోని జగన్నాథ గట్టులో నూతనంగా నిర్మిస్తున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మానిఫ్యాక్చరింగ్ (ఐఐఐటీడీఎం)కు సంబంధించి తాగునీటి సరఫరా చేసే విషయమై నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ట్రిపుల్ ఐటీలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అదనపు నిధులను ప్రత్యేకంగా ప్రభుత్వం విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలీసు శాఖలో హోంగార్డులు కీలకం

హోంగార్డు కమాండెంట్ మహేష్



హోంగార్డులతో మాట్లాడుతున్న కమాండెంట్ మహేష్

కర్నూలు, సెప్టెంబరు 23: పోలీసు శాఖలో అన్ని విభాగాల్లో హోంగార్డులు చాలా కీలకమని హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై హోంగార్డులతో మాట్లాడారు. హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విధుల్లో నైపుణ్యం పెంచుకోవాలని, జీవీత బీమా పాలసీలు చేయించుకోవాలని సూచించారు. హోంగార్డు డీఎస్పీ కృష్ణమోహన్, ఆర్ఐ జావీద్ తదితరులు ఉన్నారు.

జగన్‌ను అరెస్టు చేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 23: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడి మాజీ సీఎం జగన్ ఘోరమైన తప్పిదం చేశారని, ఆయనను తక్షణమే అరెస్టు చేయాలని ఆదోని శాసనసభ్యుడు డాక్టర్ పార్థసారథి కూటమి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తిరుమల లడ్డూ వందల కోట్ల హిందువులకు పవిత్ర ప్రసాదమని, దీనిని అపవిత్రం చేసిన జగన్‌తో పాటు అప్పటి టీటీడీ ఛైర్మన్లు భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సూర్యప్రకాష్, యోగానంద్ చౌదరి, నగరూరు రాఘవేంద్ర, సాయిప్రదీప్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

68వ స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభం



స్కూల్‌గేమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల రూరల్, సెప్టెంబరు 23 : కర్నూలు, నంద్యాల జిల్లాల 68వ జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు నంద్యాలలో కేవీఎం మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ రవికృష్ణ, నంద్యాల డిప్యూటీ ఈవో మహబూబ్‌బేగ్, నంద్యాల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శివకుమార్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాల, బాలికలకు రెజ్లింగ్, రోప్స్ స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్, బాల్ బాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 600మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శివప్రసాద్, హెచ్ఎం అసదుల్లా, లక్ష్మయ్య, జిల్లా పీఈటీ అండ్ పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి బీఈడీ సెమిస్టర్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 23: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 24 నుంచి 29 వరకు బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రెగ్యులర్ 2871, సప్లిమెంటరీకి 410 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. పరీక్షలు ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 3:30 వరకు జరుగతాయన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని ఆయన సూచించారు.

జిల్లాలో పలువురు ఏపీపీల బదిలీ

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 23: జిల్లాలో పని చేస్తున్న పలువురు ఏపీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాలు జారీ చేశారు. ఆలూరు ఏపీపీగా నందికొట్కూరులో ఏపీపీగా పని చేస్తున్న రమాకిషోర్‌ను ఆలూరులో పని చేస్తున్న భాస్కర్‌ను డోన్ ఏపీపీగా బదిలీ చేశారు. నందికొట్కూరు ఏపీపీగా కర్నూలు మొబైల్ కోర్టులో ఏపీపీగా పని చేస్తున్న సుష్మితను కర్నూలులో జువైనల్ కోర్టు ఏపీపీగా పని చేస్తున్న సుబ్బయ్యను ఆళ్లగడ్డకు బదిలీ చేశారు. కర్నూలు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ ఖాదర్‌బాషాకు కర్నూలు జువైనల్ కోర్టు ఏపీపీగా కూడా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఎమ్మిగనూరులో పనిచేస్తున్న గోపాలకృష్ణను కర్నూలు ఎక్సైజ్ కోర్టుకు ఆళ్లగడ్డలో పని చేస్తున్న అనిల్ కుమార్‌ను కర్నూలు మొబైల్ కోర్టుకు డోన్‌లో పని చేస్తున్న పద్మజను కదిరి కోర్టుకు కర్నూలు ఎక్సైజ్ కోర్టులో పని చేస్తున్న విష్ణువర్ధన్‌ను పలమనేరు కోర్టుకు బదిలీ చేశారు.

గృహ నిర్మాణ శాఖలో...

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 23: గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్దలింగమూర్తి బదిలీ అయ్యారు. సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. పంచాయితీరాజ్‌శాఖలో డీఎల్‌పీవోగా పని చేస్తున్న ఈయనను పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు. దీంతో పాటు ఆదోని డివిజన్‌లో ఈఈగా పని చేస్తున్న రవికుమార్‌ను ప్రకాశం జిల్లాకు మదనపల్లిలో ఈఈగా పని చేస్తున్న వెంకటదాసును కర్నూలుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

డీఎస్‌వోగా రఘువీరా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23: డీఎస్‌వోగా రఘువీరా నియమితులయ్యారు. ప్రస్తుతం పని చేస్తున్న డీఎస్‌వో ప్రసాద్ రాజమండ్రికి బదిలీ అయ్యారు. భూసర్వే శాఖలో 65 మంది బదిలీ అయ్యారు. డీఆర్‌డీఏ శాఖలో 70 మంది బదిలీ అయ్యారు.


రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం

హొళగుంద, సెప్టెంబరు 23 : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో ఖలందర్ అనే వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. హొళగుంద మండలం మార్లమాడికి రోడ్డులోని బాదర్‌సాబ్ టీపీ వద్ద ఈ సంఘటన జరిగింది. హొళగుందలోని దిడ్డి కాలానికి చెందిన సిద్ధప్ప కర్ణాటకలోని మాటేసుగురు గ్రామంలో పనులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా, హొళగుందకు చెందిన ఖలంధర్, అతని స్నేహితుడు కాలేసాబ్ హొళగుంద నుండి కర్ణాటకలోని భాదుగుంప్ప గ్రామానికి వెళ్తుండగా మురళి రైస్ మిల్లు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఖలందర్ ఎడమ కాలు విరిగిపోయి తీవ్ర రక్తస్రావమైంది. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో బళ్లారిలోని ఓపీడీ ఆస్పత్రికి తరలించారు. కాలేసాబ్‌కు కుడి కాలుకు తీవ్ర గాయమైంది. సిద్ధప్ప తలకు, కాలికి గాయమైంది. వీరికి హొళగుంద పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి, ఆదోనిలోని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్..!

● సుముఖత వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు ● న్యాయవాదుల హర్షం



కర్నూలు లీగల్/ కర్నూలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు త్వరలోనే మంత్రివర్గ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపుతామని సీఎం చంద్రబాబు సోమవారం పేర్కొన్నారు. దీంతో కర్నూలు న్యాయవాదులు, ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. హైకోర్టు బెంచ్ త్వరలో ఏర్పాటు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అమరావతిలో న్యాయ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. మొదటి నుంచి టీడీపీ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామంటూ స్పష్టమైన హామీ ఇచ్చింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తూ ఆర్భాటపు ప్రకటనలు చేసింది. ప్రజలను మభ్యపెడుతూ వచ్చింది. అంతే ఉత్సాహంతో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కర్నూలు నలువైపులా 20 కి.మీల దూరంలో కల్పించేలా జగన్నాథగట్టుపై హైకోర్టు ఏర్పాటు చేస్తామని ఆర్భాటపు ప్రకటనలు చేశారే తప్ప.. ఆచరణలో అడుగులు వేయలేదు. దీనికి తోడు హైకోర్టు ఏర్పాటు చేస్తామంటున్న జగన్నాథగట్టును ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు చేసి రవాణా చేస్తూ కర్నూలు గ్రావెల్ ఫీల్డ్ (కేజీఎఫ్)గా మార్చారే తప్ప.. హైకోర్టు గానీ, హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారాలోకేశ్ ప్రజాగళం పాదయాత్ర సందర్భంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వంలో కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ సేఫ్టీ శాఖ కేబినెట్ మంత్రి పదవి చేపట్టారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి కర్నూలుకు తొలిసారిగా వచ్చిన ఆయన ఆరు నెలలు, లేదా ఏడాదిలోగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసి తీరుతామని స్పష్టంగా చెప్పిన విషయం తెలిసిందే.

రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి ఎన్డీయే ప్రభుత్వంతోనే సాధ్యమని, కర్నూలుకు హైకోర్టు రావడం సీమ ప్రజల చిరకాల వాంఛ అని తెలిపారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు వల్ల రాయలసీమ వాసుల కోరిక తీరుతుందని అన్నారు. టీడీపీ లీగల్ సెల్ నాయకులు దాసెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ కర్నూలుకు హైకోర్టు బెంచ్‌ను తీసుకురావడానికి విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు.

గూడూరు కమిషనర్‌గా నాగరాజు

మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల్లో భారీగా బదిలీలు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 23: సాధారణ బదిలీల్లో భాగంగా నగర పాలక సంస్థలో పని చేస్తున్న శానిటరీ సూపర్‌వైజర్ బి.నాగరాజును గూడూరు నగర పంచాయితీ కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న షేక్ మాలిక్‌ను కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పరిపాలన అధికారిగా నియమించారు.

● నగర పాలక సంస్థ కార్యాలయంలో నలుగురు పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను బదిలీ చేస్తూ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జే. విద్యులత ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎస్.రంగస్వామిని నందికొట్కూరు మున్సిపాలిటికి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శశిలతను డీటీసీపీకు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్‌ను డోన్ మున్సిపాలిటీకి అక్కడ పని చేస్తున్న అంజాద్‌బాషాను నగర పాలకకు బదిలీ చేశారు. అనంతపురం కార్పొరేషన్ నుంచి డిప్యూటేషన్ ప్రాతిపదికన నగర పాలక సంస్థలో పని చేస్తున్న టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ పి.మంజులమ్మ డిప్యూటేషన్ రద్దు చేశారు.

పీఆర్ డీఈఈ, ఏఈఈల బదిలీలు

కర్నూలు జిల్లా పంచాయితీరాజ్ శాఖ విభాగంలో డీఈఈ, ఏఈఈలను బదిలీ చేస్తూ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదోని డీఈ రంగస్వామిని మంత్రాలయం, పాణ్యం డీఈ మనోహర్‌ను ఆలూరు, నందికొట్కూరు డీఈ డి.లక్ష్మీనారాయణను పత్తికొండ, పత్తికొండ డీఈ రమేష్‌కుమార్‌రెడ్డిని కర్నూలు ఈఈ టు పీఏగా, మంత్రాలయం డీఈ అశ్వత్థామను ఆదోనికి, ఈఈ టు పీఏ నాగిరెడ్డిని పాణ్యం, కోడుమూరు డీఈ మహేశ్వరరెడ్డిని పీఐయూ కర్నూలు, ఆలూరు డీఈ వై.శ్రీరాములును అనంతపురం జిల్లా ధర్మవరానికి, ఎస్ఎస్ఏలో పని చేస్తున్న డీఈ కర్రెన్నను కోడుమూరుకు, నంద్యాల డీఈ గంగాధర్‌ను డోన్‌కు బదిలీ చేశారు. దీంతో పాటు 34 మంది ఏఈఈలను బదిలీ చేశారు.

నా కొడుకును ఇప్పించండి

పోలీస్ స్టేషన్‌లో తల్లి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న తిరుమలమ్మ

ఆలూరు, సెప్టెంబరు 23 : 'నా కొడుకును ఇప్పించడంటూ' సోమవారం ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆలూరు మండలం అరికెర గ్రామానికి చెందిన పాండు, ఐదు నెలల క్రితం మిద్దె పై నుంచి పడి మృతి చెందాడు. భార్య తిరుమలమ్మ ఆమె బావ, చెల్లెలు, తోడి కోడలు పథకం ప్రకారం కొట్టి మిద్దె పై నుంచి తోసి వేశారని మృతుడి తండ్రి గోవిందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పాండు ఐదేళ్ల కుమారుడు తాతయ్య వాళ్ల దగ్గర ఉంటున్నాడు. ఈ క్రమంలోనే తన కుమారుడిని ఇప్పించాలని తల్లి తిరుమలమ్మ కోర్టును ఆశ్రయించింది. కోర్టులో కేసు నడుస్తున్నా తన కుమారుడిని ఇప్పించాలని పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతోంది. అయితే ఆ బాలుడు మాత్రం తల్లి వద్దకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. సోమవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఎస్ఐ వెంకట నరసింహులు ఆమెను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాకినాడ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

జీజీహెచ్‌లో వైద్యుల నిరసన



నిరసన తెలుపుతున్న కర్నూలు జీజీహెచ్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 23: రంగరాయ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డా. ఉమామహేశ్వర రావుపై దాడి చేసి కాకినాడ ఎమ్మెల్యే, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (కేఎంసీ) అధ్యక్షుడు డా.పి. బ్రహ్మాజీ మాస్టర్ డిమాండ్ చేశారు. సోమవారం దాడిని నిరసిస్తూ ఏపీజీడీఏ కర్నూలు కేఎంసీ వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఎమ్మెల్యేని బర్తరఫ్ చేయాలన్నారు. ఏపీజీడీఏ రాష్ట్ర శాఖ నిర్ణయం మేరకు భవిష్యత్తులో కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీజీడీఏ కోశాధికారి డా. డమం శ్రీనివాసులు, నాయకులు డా. సోమప్ప, రామశివనాయక్, డా. రాజేష్, డా. వెంకట రమణ, డా. రామకృష్ణ నాయక్, పీడియాట్రిక్ హెచ్‌వోడీ డా.విజ యానందబాబు, ఏపీఏఎఫ్ఎంటీ రాష్ట్ర అధ్యక్షుడు డా. సాయి సుధీర్, మెడిసిన్ ప్రొఫెసర్ డా. రాజశేఖర్, డా. విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

పది మందికి తీవ్ర గాయాలు



ఘర్షణలో గాయపడిన కందుకూరువాసులు

కోసిగి, సెప్టెంబరు 23: మద్యం తరలింపు విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. కందుకూరు, కడిదొడ్డి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు కురువ భీమేష్, బోయ వీరారెడ్డి, కడిదొడ్డి వినోద్ కుమార్‌లు కర్ణాటక మద్యం తరలింపు డాన్లుగా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం కర్ణాటక మద్యం తరలించే విషయంలో కౌతాళం మండలం తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కోసిగి మండలం కందుకూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుల మధ్య కందుకూరులో తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కాకం మల్లయ్య, కాకం హనుమేష్, గుడికంబాలి హల్లయ్య, చూడి సురేష్, కాకం నాయుడులకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఈ దాడిలో కందుకూరు గ్రామానికి చెందిన కురువ భీమేష్, మజ్జిగ బోయ పెద్ద రామయ్య, చిన్న రాముడు, బోయ శివ, బోయ రాజు తలకు, చేతులకు గాయాలయ్యాయి. ఎస్ఐ చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి స్టేషన్‌కు తరలించారు. గాయపడిన వారిని కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ చంద్రమోహన్ ఇరు వర్గాలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

చెట్లు నరికిన వ్యక్తులపై కేసు నమోదు

మంత్రాలయం, సెప్టెంబరు 23: మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో తమ స్థలంలో, మిద్దెపై ఆటంకం కలిగిస్తున్న చెట్లను నరికిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య తెలిపారు. చెట్లు నరికిన కురువ లింగప్ప, మల్లయ్య, రామచంద్ర, లింగన్న, గడ్డం భీమయ్యలపై బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు హాజరుపరిచినట్లు తెలిపారు.

ఉల్లిగడ్డల లారీ బోల్తా

కోసిగి, సెప్టెంబరు 23: కోసిగి, మూలపల్లి రోడ్డులో మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన రైతు రామయ్య ఉల్లిగడ్డల పంటను ఆదోనికి చెందిన లారీ ఏపీ.02టీఈ4377లో లోడు చేసుకుని మూలపల్లి మీదుగా వెళ్తున్న సమయంలో అతివేగంతో అదుపు తప్పి పొలాల్లో బోల్తా పడింది. అయితే ప్రమాదంలో ఎటువంటి తీవ్రగాయాలు కాకపోవడంతో రైతుకు చెందిన ఉల్లిగడ్డలకు నష్టం వాటిలిందని రైతు రామయ్య తెలిపారు. లారీ బోల్తా పడటంతో ఉల్లి సంచులు చెరిగిపోయి నేలపాలైనట్లు తెలిపాడు. మరలా వేరే లారీలో ఉల్లిగడ్డలను లోడు చేసుకుని చెన్నై మార్కెట్‌కు తరలించారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

ఆత్మకూరు, సెప్టెంబరు 23: పాముల పాడు పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన హత్యకు సంబంధించిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఆత్మకూరు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రామాంజీనాయక్ వివరాలు వెల్లడించారు. ఎర్రగూడూరు గ్రామానికి చెందిన గుండు సిద్ధయ్య, మేకల సురేష్, సుంకేసుల అశోక్‌లు స్నేహితులు. ఈ క్రమంలోనే తన భార్యతో సురేష్ మాట్లాడుతుండటాన్ని గమనించిన సిద్ధయ్య అనుమానం పెంచుకుని భార్యతో గొడవపడ్డాడు. ఆ తర్వాత ఈ నెల 14న మధ్యాహ్న సమయంలో ముగ్గురు స్నేహితులు కలిసి కంబాలపల్లి సమీపంలోని బరక చేనుకు వెళ్లే రస్తాలోని కేసీ కెనాల్ బ్రిడ్జి వద్ద మద్యం సేవించారు. ఆ సమయంలో వివాహేతర సంబంధాలపై వారు వాగ్వివాదం చేసుకోగా చివరకు సురేష్, అశోక్‌లు ప్రణాళిక ప్రకారంతో సిద్ధయ్యను రాయితో కొట్టి బతికి ఉండగానే కేసీ కెనాల్లో వేశారు. ఆ తర్వాత ఏం తెలియనట్లుగా అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు. కాగా 17వ తేదీన కొర్రప్రోలూరు హెడ్ కేసీ కెనాల్ బ్రిడ్జి వద్ద సిద్ధయ్య మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే 22వ తేదీన పోస్టుమార్టం నివేదిక రావడంతో తలకు గాయమైనట్లు గుర్తించి హత్య కేసుగా మార్చి విచారణ చేపట్టారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్‌రెడ్డి, పాములపాడు ఎస్ఐ సురేషబాబు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. సోమవారం భానుముక్కల టర్నింగ్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన సీఐ, ఎస్సైలను డీఎస్పీ రామాంజీనాయక్ అభినందించారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు

పాణ్యం, సెప్టెంబరు 23 : మండలంలోని సుగాలిమెట్ట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. రుద్రవరం మండలం బీరవోలు గ్రామానికి చెందిన వెంకటయ్య, సిరివెళ్ల మండలం, ఇసుకపల్లె గ్రామానికి చెందిన సునీల్ బేతంచెర్లకు మోటారుసైకిల్‌పై వెళ్తుండగా వెనుక వైపు నుంచి తెలంగాణకు చెందిన కారు ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. గాయపడ్డ ఇరువురిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

నంద్యాల క్రైం, సెప్టెంబరు 23 : కొడుకును కత్తితో పొడిచి దాడిచేసిన ఘటనలో నిందితుడైన తండ్రిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అస్రార్‌బాషా తెలిపారు. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఏడేళ్ల క్రితం ఉన్నత చదువులకు హైదరాబాద్‌కు వెళ్లాడు. శనివారం ఇంటికి వచ్చిన కొడుకు తనకు పెళ్లి చేయాలని, ఆస్తిని పంచాలని తండ్రి పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డిని అడగడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకున్న క్రమంలో తండ్రి సుబ్బారెడ్డి, కొడుకు శ్రావణ్‌పై కత్తితో దాడిచేసి గాయపరచడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి సోమవారం సుబ్బారెడ్డిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

28న కవయిత్రుల జాతీయ సమ్మేళనం

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 23: నగరంలోని గణేశ్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న కవయిత్రుల జాతీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కొత్తూరు సత్యనారాయణ గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. నగర శివారులోని దిన్నెదేవరపాడులోగల ఆర్టీసీ కాలనీలోని గణేశ్ సాహితీ సదన్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సావిత్రి బాయి పూలే పేరుతో నిర్వహిస్తున్నామని, ఈ సమ్మేళనానికి తెలుగు రాష్ట్రాల నుంచి కవయిత్రులు పాల్గొంటారని తెలిపారు. కర్నూలు మార్కెట్ యార్డు మాజీ ఛైర్ పర్సన్ నగరూరు శమంతకమణి అధ్యక్షతన ఈ కవయిత్రుల సమ్మేళనం జరుగుతుందని అన్నారు. ఆసక్తిగల కవయిత్రులు ఈనెల 25లోగా తమ పేర్లు వాట్సాప్ నెం. 94402 28999లో నమోదు చేసుకోవాలని గుప్త పేర్కొన్నారు.

విద్యార్థినులకు కవితల పోటీలు

ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల్లో ప్రజలు పడిన ఇబ్బందులు, సమస్యలపై విద్యార్థినులకు కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు సత్యనారాయణ గుప్త తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ చదువుతున్న విద్యార్థినులు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. 25 లైన్లకు మించని కవితలను ఈనెల 26తేదీలోగా సెల్ నెం. 94402 28999 వాట్సాప్‌కు పంపాలని ఆయన సూచించారు.

నగరంలో భారీ వర్షం

కర్నూలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. వర్షాలకు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా కర్నూలు నగరంలో మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దాదాపు రెండుగంటలకు ఏకాధాటిగా కురిసిన భారీ వర్షం వల్ల నగర వీధులన్నీ జలమయమయ్యాయి. అశోక్ నగర్ రైల్వే బ్రిడ్జి, ఐదు రోడ్ల జంక్షన్, కొత్తబస్టాండు, నంద్యాల చెక్‌పోస్టు ఏరియా నందికొట్కూరు రోడ్డు ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహిస్తున్నాయి. నందికొట్కూరు రోడ్డులో నీటిలో గుంతలను గుర్తించలేక ద్విచక్రవాహనదారులు కిందపడి ఇబ్బందులు పడ్డారు. జిల్లా పలు ప్రాంతాల్లో ఇదే స్థాయిలో వర్షాలు కురిశాయి.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఎస్‌ఎఫ్ఐ

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 23: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాత కంట్రోల్ రూమ్ ఉంచి జిల్లా కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి కలెక్టర్ పి.రంజిత్ బాషాకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని, మెడికల్ విద్యను ప్రభుత్వమే కొనసాగించి 107, 108 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, నాయకులు అమర్‌సాయి, మల్లేష్, ఖాజా రాజు, యువరాజు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి కలెక్టర్ అభినందన

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23: పవర్ లిఫ్టింగ్ 57వ సీనియర్ విభాగంలో నాలుగు పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారిణి రేష్మాను కలెక్టర్ పి.రంజిత్ బాషా అభినందించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ సీనియర్ విభాగంలో నాలుగు పతకాలు (3 స్వర్ణాలు, 1 సిల్వర్)లను సాధించిన రేష్మాను శాలువ కప్పి కలెక్టర్ సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రేష్మా ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని కోరారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఎస్‌డీవో భూపతిరావు, పవర్ లిఫ్టింగ్ శిక్షకుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ: కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం నలుగురికి వినికిడి యంత్రాలను కలెక్టర్ పి.రంజిత్ బాషా పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల అవసరాలను అనుగుణంగా వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలను అందజేస్తున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకురాలు రయీస్‌ఫాతిమా, ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి



ఆందోళన చేస్తున్న బాధితులు, బంధువులు

గూడూరు, సెప్టెంబరు 23: గూడూరులో యువకుడు రవిని దారుణ హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబం, బంధువులు ఆందోళనకు దిగారు. సోమవారం గూడూరు పాత బస్టాండ్‌లో హత్యకు గురైన రవి ఫ్లెక్సీతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో వాల్మీకి పెద్దలు, బాధిత కుటుంబం, బంధువులతో పోలీసులు చర్చించారు. నిందితులను అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

వరద బాధితులకు సాయం అభినందనీయం



మంత్రి టీజీ భరత్‌కు చెక్ అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (అర్బన్), సెప్టెంబరు 23: వరద బాధితులకు సాయం అందించడం అభినందనీయమని మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం తన చాంబర్లో అశోక్ స్టడి సర్కిల్ అధినేత శ్రీధర్ వరద బాధితుల కోసం సీఎం సహాయనిధి కింద రూ.50 వేల చెక్‌ను మంత్రి టీజీ భరత్‌కు అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరవు తున్న విద్యార్థుల భాగస్వామ్యంతో విరాళం అందించడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన మంత్రి

కర్నూలు(ఎడ్యుకేషన్): ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో సోమవారం మంత్రి టీజీ భరత్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ సుంకన్న మాట్లాడుతూ ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు ఇప్పటి నుంచి కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రవీంద్రబాబు, డీవీఈవో పామేశ్వరరెడ్డి, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి, లెక్చరర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళం

కల్లూరు, సెప్టెంబరు 23: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కర్నూలు పట్టణంలోని శ్రీరామా ఆగ్రో జెనిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు సీఎం సహాయ నిధికి రూ.లక్ష చెక్కును పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు అందజేశారు.

● కల్లూరు మండలం ఎ.గోకులపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మాజీ సర్పంచ్ లక్ష్మీవరదారెడ్డి ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం రూ.35,500లు ఎమ్మెల్యే గౌరు చరితకు అందజేశారు.

రూరల్ మండల పీఆర్ ఏఈగా ముక్తార్‌బాషా

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 23: కర్నూలు రూరల్ మండల పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్‌గా ముక్తార్‌బాషాను నియమిస్తూ విజయవాడ పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న రవి మోహన్‌రెడ్డి కల్లూరు మండలం ఏఈఈగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ముక్తార్‌బాషాను నియమిస్తూ పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆదేశాలిచ్చారు. ఈయన విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ శాఖలో పనిచేస్తూ రూరల్ మండల పీఆర్ ఏఈగా వచ్చారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కర్నూలు మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా కూడా ఈయన పనిచేశారు. ఆయనతో పాటు కోడుమూరు నియోజకవర్గ పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కర్రెన్నను నియమించారు. కర్రెన్న సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న మహేశ్వరరెడ్డి కర్నూలు పీఐయూ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమించారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 23: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని 15వ వార్డు బుధవారపేటలోని మరెమ్మ గుడి సమీపంలోని సచివాలయం వద్ద చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హామీలను అమలు చేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో అద్భుతమైన విజయాలు సాధించిందన్నారు. గతంలో వార్డు పర్యటన చేసినప్పుడు హంద్రీ పక్కన ఉన్న గృహాలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రజలు తన దృష్టికి తెచ్చారని, వీటిని త్వరలో అందజేస్తామని అన్నారు. గ్రామాలు, జిల్లా, పట్టణాలకు రాష్ట్రానికి సంబంధించిన అవసరాలు ఉంటాయని, అన్నింటిని జోడికరించి 2024 నుంచి 2029 వరకు ఐదేళ్ల ఒక ప్రణాళిక, 2047 నాటికి ఒక ప్రణాళికను రూపొందించుకుని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శివమ్మ, నాగరాజు యాదవ్, సోమిశెట్టి నవీన్, అబ్బాస్, రామాజంనేయులు, జేమ్స్, ముంతాజ్, గున్నామార్క్, బూత్ ఇన్ చార్జిలు, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వం: ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు: ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. కల్లూరు అర్బన్ 26, 27వ వార్డు కృష్ణానగర్‌లోని సచివాలయం సమీపంలో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. టీడీపీ కూటమి ప్రభుత్వం విపత్తుల్లోనూ సంక్షేమం, అభివృద్ధి దిశగా పనిచేస్తోందన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన విజయాల కరపత్రాన్ని పంపిణీ చేసి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, చరణ్‌యాదవ్, అనిల్, రవి, బీసన్న వెంపేంట రాంబాబు, క్యాతూరు మధు, గంగాధర్‌గౌడ్, పిజి.వెంకటేష్ పాల్గొన్నారు.



హుశేనాపురంలో స్టిక్కర్లను అతికిస్తున్న మల్లెల రాజశేఖర్

వంద రోజుల్లోనే రాక్షస పాలనకు విముక్తి: మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు: వంద రోజుల్లో వైసీపీ రాక్షస పాలననకు విముక్తి కల్పించామని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతించికారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో పాసు పుస్తకాలపై జగన్ బొమ్మను తొలగించామని, రూ.1000 పింఛన్ పెంచి ఒకటో తేదీన ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రగోవర్ధనమ్మ, ఎంపీటీసీ చిన్నమ్మ, నాయకులు చంద్రపెద్దస్వామి, రాము, మహబూబ్ బాషా, కేవీ మధు, బొల్లనాగరాజు, షమీవుల్లా, గువ్వ రవికుమార్, సుధాకర్, రామగోవిందు, బజారు, కాటినేని నారాయణ పాల్గొన్నారు.

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు: ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు(రూరల్): విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మండలంలోని ప్యాలకుర్తిలో ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా వందరోజుల పాలనపై ప్రజలకు తెలియజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వందరోజుల పాలన చూస్తే పింఛన్లు పెంపు, డీఎస్సీ నోటిఫికేషన్, పంచాయతీలకు నిధులు, పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేశారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే, స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అతికించి, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్ నాయక్, ఎంపీడీవో చంద్రశేఖర్, టీడీపీ నాయకులు ఉగాది వెంకటేశ్వర్లు, రాఘవేంద్రయాదవ్, చంద్రమౌళి, షేక్షావలి, లారీ విజయ్, విజయ్‌యాదవ్, రంగన్నయాదవ్, ఆరీఫ్, డాక్టర్ అలీం, మౌలీసుభహాన్, ఈ.సునీల్ పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

గూడూరు: ప్రజలకు మంచి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకుడు సృజన్, కౌన్సిలర్ బుడ్డంగలి అన్నారు. సోమ వారం గూడూరులోని ఒకటో వార్డులో టీడీపీ నాయకుడు సృజన్ ఆధ్వర్యం లో ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాల పోస్టర్‌ను అందించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

మౌలిక వసతులు కల్పించాలి

ఓర్వకల్లు, సెప్టెంబరు 23: ఓర్వకల్లు తహసీల్దార్ కార్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి రామేష్, రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, సుగాలి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుండాల నాయక్, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, ఇద్రుస్‌బాషా, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి అయ్యన్న, మహబూబ్ బాషా కార్యాలయం ఎదురుగా నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో తాగునీరు, టాయిలెట్లు, ప్రహరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, రాము పాల్గొన్నారు.

ఇన్‌ఫెర్టిలిటీ సదస్సులో కేఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కర్నూలు(హస్పిటల్), సెప్టెంబరు 23: రెండు రోజులుగా జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌ఫెర్టిలిటీ సదస్సులో కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన గైనిక్ విభాగం ప్రతిభ చాటింది. ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు పీజీలకు పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్‌లో మొత్తం నలుగురికి బహుమ తులు వచ్చాయి. సోమవారం ప్రతిభ చాటిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్లు సుప్రియ, ప్రియ, పీజీ వైద్యులు షారూన్, మనీషాలను కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ అభినందించారు. కార్యక్ర మంలో గైనిక్ విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ శ్రీలక్ష్మి, ప్రొఫెసర్లు సావిత్రి, పద్మజ, వరలక్ష్మి, స్నిగ్ధ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సి.బెళగల్, సెప్టెంబరు 23: రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ విజయశ్రీ వీఆర్వోలను హెచ్చరించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయ సమావేశ భవనంలో వీఆర్వోలతో ఆమె సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సర్వేయర్ నాగభూషణం, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, వీఆర్వోలు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, సెప్టెంబరు 23: గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రాముడు కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని బోర్లు, వీధి దీపాలు, డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. సమావేశంలో ఈవోఆర్డీ సందీప్ పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ



బాధితురాలిని పరామర్శిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కర్నూలు(హస్పిటల్), సెప్టెంబరు 23: కర్నూలు పెద్దాసుపత్రిలోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్, కార్డియోథొరాసిక్ వార్డులో చికిత్స పొందుతున్న దళిత మహిళ గోవిందమ్మకు కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ బిందుమాధవ్‌లు సోమవారం పరామర్శించారు. ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని, భయపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ బాధితులకు భరోసా ఇచ్చారు. గోవిందమ్మ చిన్న కొడుకు రాజుతో మాట్లాడుతూ అమ్మకు ధైర్యం చెప్పాలని.. ఏ సమస్య వచ్చినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకుని వెళ్లాలని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం నుంచి అందించిన రూ.50వేల మానిటరి రిలీఫ్ ఫండ్ జమ అయిందా అని కలెక్టర్ రాజును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఏఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శివబాల, న్యూరోసర్జరీ హెచ్‌వోడా బాలాజీ నాయక్ ఉన్నారు.

నంది నాటక పోటీలకు 'జగదేక సుందరి సామా'

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 23: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈ ఏడాది జరిగే రాష్ట్ర స్థాయి నంది నాటక పోటీల్లో 'జగదేక సుందరి సామా' అనే పద్య నాటకాన్ని ప్రదర్శిస్తామని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం టీజీవీ కళాక్షేత్రంలో ఈ నాటక రాత ప్రతికి పత్తి ఓబులయ్యతోపాటూ, కళాకారులు పూజలు చేశారు. అనంతరం నాటకం రిహార్సల్స్ ప్రారంభించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే నంది నాటక పోటీలకు టీజీవీ కళాక్షేత్రం పక్షాన నాటకాన్ని ప్రదర్శిస్తూ నంది అవార్డులు సాధిస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో రాబోయే పోటీలకు కూడా ఈ నాటకాన్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దివంగత సినీ, నాటక రచయిత పల్లెటి లక్ష్మీకులశేఖర్ రాసిన ఈ నాటకానికి తాను దర్శకత్వం వహిస్తున్నట్లు తెలిపారు. కళాకారులు శ్రీనివాసరెడ్డి, బాలవెంకటేశ్వర్లు, పాండురంగయ్య పాల్గొన్నారు.

ఉర్దూ వర్సిటీలో స్వచ్ఛతా హి సేవా

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 23: గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మహబూబ్ బాషా తెలిపారు. సోమవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 23: విజయవాడలో ఈ నెల 24వ తేదీ నుంచి 26 వరకు జరగబోయే రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలకు కర్నూలు జిల్లా ఫుట్‌బాల్ సెక్రటరీ వై.శ్రీనివాసులు క్రీడాకారులను ఎంపిక చేశారు. అనంతరం క్రీడాకారులకు ఫుట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్ కిట్లు పంపిణీ చేశారు.

వినతుల పరిష్కారంలో అలసత్వం వద్దు: కమిషనర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 23: ప్రజల వినతుల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దని నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అన్నారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ 21 అర్జీలు స్వీకరించారు. 39వ వార్డులో అసంపూర్తిగా ఉన్న రహదారిని పూర్తి చేయాలని, జొహరాపురం ప్రభుత్వ వాహన డ్రైవర్స్ అసోసియేషన్ కాలనీలో రోడ్డు నిర్మించాలని, 9 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని క్లాప్ ఆటో డ్రైవర్లు, తమ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని చెన్నమ్మ కూడలిలోని పంచరత్న కాలనీవాసులు, చెక్‌పోస్టు వద్ద జొహరాపురంలో రోడ్డులో వైన్ షాపులు తొలగించాలని, 34వ వార్డు సర్వే నెంబరు 301/1 స్థలంలో పార్కు స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, టీపీ ఆర్ఓ వెంకటలక్ష్మి, ఏసీపీ మంజులత పాల్గొన్నారు.

రోడ్లపై వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలి: నగరంలోని రోడ్లపై వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని కమిషనర్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలో కురిసిన వర్షంతో, నీటి నిల్వలకు ఆస్కారం లేకుండా కమిషనర్ అధికారులను అప్రమత్తం చేశారు. ఐదు రోడ్ల కూడలి, గడియారం ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ స్థానికులతో మాట్లాడారు. ఆయన వెంట డీఈఈ గిరిరాజు, ట్రైనీ ఏఈ స్వాతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వలి, లోకేష్ ఉన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం



చింతలపల్లెలో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 23: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చింతలపల్లె గ్రామంలో ఆర్టీసీ నూతన బస్సును సుధాకర్ రెడ్డితో పాటుసర్పంచులు చదువుల సుజాతమ్మ, వెంకటరమణ, ఎంపీపీ శేషమ్మలు ప్రాంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నుంచి ప్రతి రోజూ పాలకొలను, చింతలపల్లెకు రెండు దఫాలుగా బస్సు తిరుగుతుందన్నారు. గతంలో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఆటోల కోసం రోడ్లపై గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర, సురేష్, మల్లిరెడ్డి, శేఖర్, గ్రామస్థులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

అర్బన్ తహసీల్దార్‌గా వెంకటలక్ష్మి

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 23: కర్నూలు అర్బన్ తహసీల్దార్‌గా ఇ.వెంకటలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పత్తికొండ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆమెను కలెక్టర్ రంజిత్‌బాషా కర్నూలు అర్బన్ మం డల తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటలక్ష్మి ఎన్నికలకు ముందు ఆదోని ప్రాంతంలో కూడా పనిచేశారు. ఇదివరకు అర్బన్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రామాంజనమ్మకు ఆర్డీవోగా పదోన్నతి రావడంతో రిలీవ్ అయ్యారు. ఆమె స్థానంలో వెంకటలక్ష్మిని కలెక్టర్ నియమించారు.

ఇళ్ల స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయండి

కల్లూరు, సెప్టెంబరు 23: కల్లూరు మండలం బస్తిపాడులో ఇళ్ల స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు సోమవారం కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేదలకు కేటాయించిన స్థలాలకు హద్దులు చూపించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా సర్వే నెంబరు 465లో పాఠశాలకు ఐదు ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు వెంకట రమణారెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఓర్వకల్లు, సెప్టెంబరు 23: మండలంలోని గుట్టపాడు గ్రామానికి చెందిన గూడెం అరుణ (25) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం అరుణ ఇంట్లో స్పృహ లేకుండా పడిపోవడంతో గమనించిన భర్త రమేష్, బంధువులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడి వైద్యులు పరీక్షించగా.. అప్పటికే మృతి చెందిందని చెప్పారని అన్నారు. మృతురాలి తల్లి శ్యామల తన కూతురు అనుమానాస్పద స్థితిలో మరణించిందని ఫిర్యాదు చేశారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సేవలు అభినందనీయం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 23: విజయవాడ వరద బాధితులకు సేవలందించిన డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులను సీపీఎం రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల అభినందించారు. సోమవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన అభినందన సభలో విద్యార్థి సంఘాల నాయకులకు నిర్మల జ్ఞాపికలను అందజేశారు.

● సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు పీఎస్.రాధాకృష్ణ కోరారు. జొహరాపురం 18వ వార్డు షద్రక్ కాలనీలో జరిగిన ఆ శాఖ మహాసభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు అవుతున్న సామాజిక పెన్షన్లు తప్ప సంక్షేమ పథకాలు ఏమి అమలు చేయలేదన్నారు.

ఏఐసీఎం సమావేశంలో మేయర్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 23: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దివాస్ నగరంలో సోమవారం జరిగిన అఖిల భారత మేయర్ల మండలి (ఏఐసీఎం) కార్యవర్గ సమావేశానికి మేయర్ బీవై రామయ్య హాజరయ్యారు. ఏఐసీఎం జాతీయ అధ్యక్షురాలు అతుల్‌పటేల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యుడు హోదాలో మేయర్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 23: ప్రధాని నరేంద్ర మోదీ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లకు నిరసనగా ఈనెల 23న బ్లాక్‌డే నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు ఎస్.మునెప్ప, చంద్రశేఖర్, సాయిబాబా, నాగన్న, శ్రీనివాసరావు, కే.రామకృష్ణ పాల్గొన్నారు.

'థాలి భజావో'ను విజయవంతం చేయండి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 23: కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం చేపడుతున్న థాలి భజావో నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని మండి పడ్డారు. వెంటనే ఆ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ థాలి భజావో(ప్లేట్లను గరిటెలతో వాయిస్తూ నిరసన) అనే నినాదంతో జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిర్వహించాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా ఆదేశించారని తెలిపారు. ఈసమావేశంలో షేక్ జిలాని బాషా, దామోదరం రాధాకృష్ణ, ఎస్ ప్రమీల, వెంకటసుజాత పాల్గొన్నారు.

జీవో జారీపై హర్షం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 23: మెసెజ్‌కు స్పందించి 25 మంది విభిన్న ప్రతిభావంతులకు ఐఐటీలో సీట్లు వచ్చే విధంగా జీవో విడుదల చేయడం హర్షించ దగ్గ విషయమని విభిన్న ప్రతిభావంతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం వంద రోజుల పాలనలో విభిన్న ప్రతిభావంతుల్లో శాతాన్ని బట్టి రూ.3వేల పింఛన్‌ను రూ.6వేలు, రూ.10వేలు ఉన్న పింఛన్‌కు రూ.15వేలకు పెంచిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మక్బుల్ బాషా, సురేష్ నాయుడు, జేమ్స్, సత్రం రామకృష్ణ పాల్గొన్నారు.

సర్వేపల్లిలో ఫుడ్ కార్నివాల్

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 23: స్థానిక కృష్ణానగర్‌లోని సర్వేపల్లి విద్యాసంస్థల్లో ఫుడ్ కార్నివాల్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, హెచ్ఎం కేపీ అరుణశ్రీ, చైర్మన్ సి.కేశన్న, సి.దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

స్కంద కాలనీలో చోరీ

కర్నూలు, సెప్టెంబరు 23: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉల్చాల రోడ్డులో ఉన్న స్కంద కాలనీలో దొంగతనం జరిగింది. బంధువుల ఊరికి వెళ్లిన మహబూబ్ బాషా అనే వ్యక్తి ఇంట్లో దొంగలు పడి ఐదు తులాల బంగారు, రూ.80వేలు నగదు చోరీ చేశారు.

కళాశాలలో శ్రమదానం

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 23: నగరంలోని కేవీఆర్ జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులు సోమవారం శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్, ప్రిన్సిపాల్ లాలెప్ప, మాజీ కార్పొరేటర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన సభ

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 23: ఆర్.కొంతలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం క్రీడాకారుల అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ హెచ్ఎం సావిత్రి, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రధాని పథకాలు ఆదర్శప్రాయం

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 23: ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన పథకాలు ఆదర్శప్రాయమని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. సోమవారం నగరంలోని 46వ వార్డులో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర, నాయకులు కోటి, శ్రీరామ్, గోపాల్, విజయ్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కమిషనర్

ఆదోని టౌన్, సెప్టెంబరు 23: ఆదోని మున్సిపాలిటీకు కమిషనర్‌గా యం. కృష్ణ సోమవారం బాధ్యతలను చేపట్టారు. గతంలో కమిషనర్‌గా పని చేసిన రామచంద్ర రెడ్డి భీమవరానికి బదిలీ అయ్యారు. ఇంతవరకు అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

పత్తికొండ తహసీల్దార్‌గా రమేష్

పత్తికొండ, సెప్టెంబరు 23: తహసీల్దార్‌గా రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో హాలహర్విలో పనిచేసి, ఎన్నికల విధుల్లో కడప జిల్లా ప్రొద్దుటూరులో పని చేశారు. అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా పత్తికొండకు నియమితులయ్యారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

ఆలూరు రూరల్, సెప్టెంబరు 23: ఈనెల 24 నుంచి నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏడీఏ సునీత అన్నారు. సోమవారం మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో రైతులకు లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామన్నారు. రైతులు పంట మార్పిడి పాటించాలని, పత్తిలో రసం పీల్చే, గులాబీ పురుగుల నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏవో వెంకటేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

పప్పుశనగ విత్తనాలు ఇవ్వాలి

మద్దికెర, సెప్టెంబరు 23: ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా పడ్డాయని పప్పుశనగ విత్తనాలు ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి హనుమన్న వ్యకాసం అధ్యక్షుడు కోదండ రాముడు డిమాండ్ చేశారు. సోమవారం ఏవో రవికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఏవో 3,600 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపామని, వచ్చిన వెంటనే రైతులకు అందజేస్తామని అన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు 28న కౌన్సెలింగ్

ఆలూరు, సెప్టెంబరు 23: ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఈనెల 28న నాలుగో 4వ విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సూర్య శేఖర్ రెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. 26 సాయంత్రం 5లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 27న వెరిఫికేషన్ చేసుకోవాలని, 28న నేరుగా రావాలని కోరారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 23: మండలంలోని పెసలదిన్నె గ్రామానికి చెందిన యోహాన్‌పై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. భార్య సులోచన తనకు 18ఏళ్ల క్రితం యోహాన్‌తో వివాహమైనట్లు, అయితే కట్నం కోసం వేధించినట్లు ఫిర్యాదు చేసిందన్నారు.

ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు

హొళగుంద, సెప్టెంబరు 23: మండలంలోని హెబ్బటం ఎంపీపీ పాఠశాలలో 150 మంది విద్యార్థులు ఉండగా, 125 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. అయితే పిల్లలకు సరిపడా ఆహారం పెట్టడంలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 75మందికి మాత్రమే సరిపడేలా చేస్తున్నారని, మెనూ పాటించడం లేదన్నారు. సోమవారం వెజిటేబుల్ రైస్, కోడిగుడ్డుతో టమోటా కర్రీ చేయాల్సి ఉండగా, ఉడికి ఉడకని కలర్ రైస్, టమోటా చారులో కోడి గుడ్లు ఇచ్చారని అన్నారు. తినలేక విద్యార్థులు పాడవేశారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా కూరగాయలు లేవని అన్నారు. హెచ్ఎం లక్ష్మన్నను వివరణ కోరగా ప్రతిరోజు బాగుంటుందని, ఈరోజు సరిగా లేదని అన్నారు.

లడ్డూ విషయంలో తప్పు ఒప్పుకోవాలి

పత్తికొండ, సెప్టెంబరు 23: తిరుమల లడ్డూ విషయంలో చేసిన తప్పును వైసీపీ ఒప్పుకోవాలని తెలుగు మహిళా రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణకుమారి డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వంపై విమర్శలకు దిగడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

తహసీల్దార్ లోకేశ్వరరావు బాధ్యతలు

దేవనకొండ, సెప్టెంబరు 23: తహసీల్దార్‌గా లోకేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా నుంచి బదిలీపై దేవనకొండకు వచ్చారు మరో నాలుగు నెలల్లో పదవివీరమణ చేయనున్నారు. గతంలో పనిచేసిన జయన్న మండలంలో నెల రోజుల తహసీల్దార్‌గా పని చేసి పదవి విరమణ పొందారు.

చక్కెర లారీ బోల్తా

పత్తికొండ, సెప్టెంబరు 23: పత్తికొండ బైపాస్‌లో సోమవారం రాత్రి చెక్కర లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఎదురుగా వాహనాన్ని తప్పించబోయి డ్రైవర్ లారీని రోడ్డుపక్కకు తీసుకెళ్లాడు. అయితే టెలిఫోన్ కేబుల్స్ గుంతలో లారీ కూరుకుపోయి బోల్తా పడింది. గమనించిన డ్రైవర్, క్లీనర్ బయటకు దూకడంతో ప్రాణాలతో బయట పడ్డారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

జగనన్న కాలనీ పరిశీలన

కోసిగి, సెప్టెంబరు 23: నజ్జలగుడ్డం రోడ్డులోని జగనన్న కాలనీలో అక్రమంగా బండలు పాతారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ నిత్యానందరాజు, హౌసింగ్ ఏఈ శేఖర్ సోమవారం కాలనీని పరిశీలించారు. అసలైన లబ్ధిదారులను తెలుసుకుని న్యాయం చేస్తామని తెలిపారు. వీఆర్వోలు లింగన్న, వీరేష్ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆస్పరి, సెప్టెంబరు 23: ముత్తుకూరు గ్రామానికి చెందిన ఉప్పర లక్ష్మన్న (24) చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు. కైరుప్పల నుంచి తన భార్య స్వగ్రామం వెంగళాయి దొడ్డికి వెళుతూ బైక్‌నుంచి కిందపడ్డాడు. ఆదోని ఆసుపత్రిలో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని సీఐ తెలిపారు. మృతుడికి భార్య పద్మావతి, ఇద్దరు కుమారులు ఉన్నారని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 23: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా. కల్పన అన్నారు. సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలు పారిశుధ్య కార్మికులు మనలను కాపాడుతున్నారని అన్నారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. కోఆర్డినేటర్ నరేష్, బీజేపీ నాయకులు గోవర్దన్, మల్లికార్జున, రామ్మోహనాచారి, ఖాసీం, దేవయ్య పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు

దేవనకొండ, సెప్టెంబరు 23: కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, ఏఐటీయూసీ నాయకుడు నర్సారావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం వద్దం బ్లాక్ డే సందర్భంగా నిరసన తెలిపారు. యూసుఫ్, కృష్ణ, భాస్కర్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దాం

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 23: ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకుందామని ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న పిలుపునిచ్చారు. సోమవారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛత జీవితంలో భాగం కావాలన్నారు. ఇంటిని కళాశాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మనం ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గోవిందరాజులు, అధ్యాపకులు వేదావతి, చిట్టి ప్రసాద్ సూరిబాబు పాల్గొన్నారు.

ముప్పు



హైటెన్షన్ విద్యుత్ తీగలకు అల్లుకున్న పిచ్చి మొక్కలు

హెబ్బటం గ్రామంలో ఆదోని హొళగుంద ప్రధాన రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. తీగలు ట్రాన్స్‌ఫర్మార్‌ను చుట్టేయడంతో ముప్పు ఉందని తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- హొళగుంద**


మూత



చింతకుంటలో మూతపడ్డ సచివాలయం

చింతకుంట సచివాలయం-2 ఉద్యోగులు లేక మూతబడింది. సోమవారం పనులు కోసం వచ్చిన గ్రామస్థులు వెనుదిరిగారు. సంక్షేమ పథకాలు అమలు, పర్యవేక్షణ కోసం నియమించిన ఉద్యోగుల బదిలీలపై వెళ్లిపోయారు. కొక్కొరచేడు, బేవినహల్ సచివాలయాలు కూడా ఇంతే. **- హాలహర్వి**

మునక



ఆస్పరిలో నీట మునిగిన చిక్కుడుకాయ, టమోటా

సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. 18.0 మిల్లీమీటర్ల వర్షం పాతం నమోదయింది. దీంతో పంటలు నీట మునిగాయి. చిక్కుడకాయ, టమోటా, మిరప, పత్తి, కంది పంటలు దెబ్బతిన్నాయి. ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. **- ఆస్పరి**

సమస్యలను పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య

ఆదోని, సెప్టెంబరు 23: పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలు కొన్ని.. పెద్ద కడుబూరు మండలం చిన్నకడబూరు గ్రామానికి చెందిన రామాంజినేయులు తనకు ఆదోని మండలం దయ్యాల గూడెం సర్వే నెంబర్ 67/బీ1లో 2.55 ఎకరాల భూమి ఉందని. రిజర్వ్ ఫారెస్టుగా నమోదైందని సరిచేయాలని కోరారు.

2. ఆదోని పట్టణం కోట్ల విజయభాస్కర్ రెడ్డి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు అర్జీ సమర్పించారు. తనకు ప్రభుత్వం పట్టా ఇచ్చి స్థలం చూపలేదని పట్టణానికి చెందిన శాంతి అర్జీ ఇచ్చారు. మదిరె గ్రామానికి చెందిన గోవిందరెడ్డి తనకు సర్వే నెం.379 ఏ/1లో 4.95 ఎకరాల భూమి ఉందని, ఆన్‌లైన్‌లో 3.24 ఎకరాలే ఉందని సరిచేయాలని అర్జీ ఇచ్చారు. సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాస రాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, డీఎల్పీవో నూర్జహాన్, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, డీటీ వలిబాషా పాల్గొన్నారు.

దళిత న్యాయవాదికి న్యాయం చేయండి

దళిత న్యాయవాది చంద్రయ్యకు న్యాయం చేయాలని మాలమహానాడు రాష్ట్ర నాయకుడు గడ్డం హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు మహానంది డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆదోని (అగ్రికల్చర్): పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఆర్‌పీఐఎఫ్ అధ్యక్షుడు కృష్ణ కార్యదర్శి కాజా కోరారు.

వరద బాధితులకు రూ.5 లక్షల విరాళం



సీఎంకు చెక్కు అందజేస్తున్న డైరెక్టర్లు

ఆదోని, (అగ్రికల్చర్), సెప్టెంబరు 23 : వరద బాధితుల సహాయార్థం ఆదోని కిడ్డీస్ పాఠశాల యాజమాన్యం రూ.5లక్షలు అందజేసింది. సోమవారం డైరెక్టర్లు కేశవ నారాయణ రెడ్డి, చేన్నపురెడ్డి సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు యాజమాన్యం కలిసి విరాళం ఇచ్చామన్నారు. అలాగే పదో తరగతిలో 597 మార్కులు సాధించిన పాఠశాల విద్యార్థులు హర్షవర్ధన్‌కు రూ.50 వేలు, శ్రీవల్లికి (596 మార్కులు) రూ.25 వేల చెక్కును సీఎం చేతుల మీదుగా తాము అందజేశామని, విద్యార్థులను సీఎం అభినందించినట్లు తెలిపారు.

సస్పెండ్ చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 23: ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మైత్రేయిని సస్పెండ్ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి రాజీవ్, గోవింద రాజు, విజయవాడ సిటీ జాయింట్ సెక్రటరీ లంకె సాయి డిమాండ్ చేశారు. ప్రైవేట్ క్లినిక్‌లో పనిచేస్తూ, ప్రభుత్వాసుపత్రికి వచ్చేయ గర్భిణులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గర్భిణులు, నవజాత శిశు మరణాలకు కారణమవుతున్నా జిల్లా వైద్యాధికారులు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. సొంత క్లినిక్ వస్తేనే వైద్యం చేస్తానని లేదంటే చేయనని ఆశా వర్కర్లను ఆసరాగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఆసుప్రతిలోని స్క్రాప్‌ను రూ.14 లక్షలకు అమ్ముకున్నారని చ కమిషనర్‌కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

పేదల అభ్యున్నతికి కృషి

నియోజకవర్గాల్లో ఇది మంచి ప్రభుత్వం



మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

క్రిష్ణగిరి, సెప్టెంబరు 23: పేదల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం కంబాలపాడు గ్రామంలో ఇదిమంచి ప్రభుత్వం కార్యక్ర మాన్ని నిర్వహించారు. సర్పంచ్ మారెమ్మ, ఎంపీటీసీ చంద్రమ్మ, మాజీ సర్పంచ్ కేఈ శేషాద్రి, ఆలంకొండ నబీ సాహెబ్, మాదాపురం ఎల్వీ ప్రసాద్, దామోదర్ నాయుడు, గురుస్వామి, మహమ్మద్ రఫీ, ఎంపీడీవో విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: బోగోలు గ్రామంలో ఎమ్మెల్యే శ్యాంబాబు, సర్పంచ్ అమర్‌నాథ్‌గౌడ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నాగేశ్వరరావుయాదవ్, రామకృష్ణాచారి, నాగేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌గౌడు, ఎమ్మార్వో చంద్రశేఖర్‌వర్మ, ఎంపిడివో శివమల్లేశ్వరప్ప, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ దశలవారీగా అమలు..

గోనెగండ్ల: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను దశలవారిగా సీఎం చంద్రబాబు అమలు చేస్తారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం గోనెగండ్ల ఎస్సీ కాలనీలో ఇదిమంచి ప్రభుత్వం నిర్వహించారు. రూ. 50 లక్షలతో గ్రామంలో నిర్మించనున్న సీసీ, డ్రైనేజీ పనును ప్రారంభించారు. గతంలో టీడీపీ ఆర్‌డీఎస్ పనులకు రూ.2వేల కోట్లు మంజూరు చేస్తే వైసీపీ పనులను నిలిపివేసిందన్నారు. పూర్తి చేసే బాధ్యత తనేదనన్నారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, టీడీపీ కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, బేతాలబడేసా, రామాంజినేయులు, రమేష్‌నాయుడు, నూరహమ్మద్ , గ్రామ సర్పంచ్ హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మదీనా, మిన్నల్ల, పుట్టపాశం వెంకటేశ్వరాచారి, కులుమాల రాముడు, కులుమాల చాంద్, పాల్గొన్నారు. చింతలాముని నల్లారెడ్డి దశమి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పూజలు చేశారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

చింతలాముని, నల్లారెడ్డి దశమి ఉత్సవాల్లో ఎమ్మెల్యే బండలాగుడు పోటీలను ప్రారంభించారు.

వైసీపీ ప్రజామోదం కోల్పోయింది

ఆదోని టౌన్: వైసీపీ ప్రజామోదం కోల్పోయిందని టీడీపీ నాయకుడు భూపాల్ చౌదరి కృష్ణమ్మ, బీజేపీ ఓబీసీ మోర్చాజిల్లా అధ్యక్షుడు మలేకార్ శ్రీనివాస్, కో కన్వీనర్ నాగరాజు గౌడ్, లోకేష్ కుమార్ అన్నారు. సోమవారం ఎస్సీవోస్ కాలనీలోని పార్కుల్లో మునిసిపల్ చైర్ పర్సన్ వాల్మీకి శాంత ఆధ్వర్యంలో ఇన్‌చార్జి కమిషనర్ . అనుపమ అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. లక్ష్మీనారాయణ, తిమ్మప్ప, వెంకటేష్, బుద్ధారెడ్డి పాల్గొన్నారు.

హొళగుంద: గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు మాల వన్నూరప్ప, లక్ష్మయ్య, పక్కీరప్ప పాల్గొన్నారు.

మద్దికెర: హంపా గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి వన్నూరప్ప, టీడీపీ నాయకులు అల్లీపీరా పాల్గొన్నారు.

ఆస్పరి: సీఎం సంక్షోభంలోను సంక్షేమం, అభివృద్ధి చేస్తునానరని టీడీపీ నాయకుడు వీరభద్ర గౌడ్ అన్నారు. సోమవారం ముత్తుకూరులో సర్పంచ్ తోజాజప్ప అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. కన్వీనర్ పరమ రెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, మధు, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, హరి, కృష్ణారెడ్డి, అరవింద్, శివకుమార్, శేశరెడ్డి, గోవిందు, గోపాల్, రాజశేఖర్, రాజకుమార్, సతీష్, కుమార్, మహేష్ పాల్గొన్నారు.

మంత్రాలయం: పంచాయతీ కార్యాలంలో టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, వరదరాజులు, ఎంపీడీవో మణిమంజరి, ఈవోఆర్‌డీ ప్రభావతి, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, బీసీ తిమ్మప్ప, శివ, రఘు, అమరేంద్రుడు, వీఆర్వో బసవన్నగౌడ్, పవన్ పాల్గొన్నారు.

ఆదోని: ఉమాపతి నాయుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవేంద్రప్ప జాలిమంచి, ఇస్వీలో పాల్గొన్నారు. రంగస్వామి నాయుడు, రామస్వామి, దేవేంద్రప్ప, శివప్ప, రంగన్న, శ్రీనివాస్ చౌదరి, బసవరాజు, అయ్యన్న, సయ్యద్, నాగప్ప, నాగరాజు, మురళి, విరుపాక్షి పాల్గొన్నారు.

నందవరం: హలహర్వి, మిట్టాసోమాపురం, కనకవీడు గ్రామాల్లో డబ్బా ఈరన్న, దావీదు, మిట్టాసోమాపురం వీరేష్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రచారం చేశారు.

కోసిగి: దుద్దిలో టీడీపీ నాయకుడు ఎన్.రాఘువేంద్రరెడ్డి, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సర్పంచ్ వరలక్ష్మి నిర్వహించారు. తహసీల్దార్ నిత్యానందరాజు, ఏవో రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఆదోని రూరల్ సెప్టెంబర్ 23: సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో గీతావాణి పేర్కొన్నారు. సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. 15శాతం అభివృద్ధితో ముందుకెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఏఎస్‌వో అనీల్ కుమార్, వైద్యులు వంశీకృష్ణ, ఏపీఓ ఖాలిక్, హౌసింగ్ ఎఈ రవి, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

కౌతాళం, సెప్టెంబరు 23: ఉరుకుంద ఈరన్న రాజగోపుర నిర్మాణానికి బెంగళూరు వాస్తవ్యులు విజయలక్ష్మి, కేవిఎన్ గుప్త రూ.1,11,111లు ఇచ్చినట్లు డీసీ వెంకటేష్ తెలిపారు. దాతలకు శేష వస్త్రాలు ఫలపుష్పలను అందజేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హొళగుంద, సెప్టెంబరు 23: గ్రామానికి చెందిన బకాడి గంగాధర్ కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా అదుపులో తీసుకున్నట్లు ఎస్ఐ బాల నరసింహులు సోమవారం తెలిపారు. వివరాల మేరకు.. కర్ణాటక నుంచి ఎల్ఎల్‌సీ కాలువపై 96, 90 ఎమ్ఎల్ టెట్రా ప్యాకెట్లు బైక్‌పై తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని బైక్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆదోని రూరల్: కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇస్పీ ఎస్ఐ నాగేంద్ర, పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ తెలిపారు. వివరాల మేరకు.. చిన్నహరివాణానికి చెందిన హనుమయ్య, హన వాలుకు చెందిన మల్లికార్జునను అదుపులో తీసుకొని, 150 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మంత్రాలయం, సెప్టెంబరు 23: ఉన్నత పాఠశాల విద్యార్థులు ఫుట్‌బాల్, సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికైనట్లు హెచ్ఎం అంపయ్య, పీడీ నరసింహరాజు, బసవరాజు సోమవారం తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 ఫుట్‌బాల్ విభాగంలో లలిత, ముస్కాన్, పద్మశ్రీ, వరుణ్‌గౌడు ఎంపికయ్యారని తెలిపారు. అండర్-17 ఫుట్‌బాల్ విభాగంలో అనిత, ఇమ్రాన్‌లు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. అండర్-14 సెపక్‌తక్రా విభాగంలో రామనాయుడు, అండర్-17లో మైబూన, మురళి విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఉపాధ్యాయులు నాగభూషణం, రామన్న, చంద్రశేఖర్, గోపాల్, విఠోబరావు, సుభాషిణి, పుష్పలత, ఈరన్న, సంధ్యారాణి, ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్‌కు..

ఆలూరు: కర్నూలులో బాస్కెట్ బాల్ పోటీల్లో ఆలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల -2 విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికైనట్లు పీడీ కవిరాజ్ సోమవారం తెలిపారు. అండర్-17లో వీ సంతోష్, సీ సాయిరాం, అండర్-14 నందు సీ చిరంజీవి, తరుణ్ తేజ ఎంపిక కాగా, ఎమ్ వెంకటేష్ స్టాండ్ బైలో ఎన్నికయ్యారని అన్నారు. వీరు పశ్చిమగోదావరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.. వీరిని ఇన్‌చార్జ్ హెచ్ఎం ధనలక్ష్మి, పీడీ కవిరాజు అభినందించారు.

విజయవంతం చేద్దాం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 23: జనవిజ్ఞానవేదిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి పోటీలను విజయవంతం చేయాలని జనవిజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు చెకుముకి పోటీల్లో పాల్గొనే చూడాలని హెచ్ఎంలను కోరినట్లు తెలిపారు. బీజి మాదన్న, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

లేబర్ కోడ్ దుర్మార్గం

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 23: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్‌కోడ్ ఏర్పాటు చేయడం దుర్మార్గమని ఏఐటీయూసీ, ఏఐకేఎస్, రైతు సంఘం నాయకులు పంపన్నగౌడ్, తిమ్మగురుడు, వీరేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో బ్లాక్‌డే నిర్వహించారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేయడం సరైంది కాదన్నారు. చిన్నన్న, దాదావలి, రవి, నాగరాజు, మల్లికార్జున గౌడ్, వీరాంజి, హనుమంతు పాల్గొన్నారు.

చీడపీడలను నివారించాలి

మద్దికెర, సెప్టెంబరు 23: కంది పంటలో చీడపీడలను నివారించుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా రీసోర్స్‌పర్సన్ నాగసరోజ సూచించారు. సోమవారం ఆర్‌బీకే కేంద్రంలో పంటలలో ఆధునీక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆధునిక పద్దతులు, పంటల సాగు, యాజమాన్య పద్దతులు వివరించారు. ఏవో ఉప్పర రవి, జాకీర్ హుశేన్, రాణి, కవిత ఉన్నారు.

వినియోగంలోకి తెస్తాం

మద్దికెర, సెప్టెంబరు 23: మండలంలోని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెస్తామని ఎంపీడీవో సువర్ణలత, సర్పంచ్ బండారు సుహాసిని అన్నారు. సోమవారం చెత్త సంపద కేంద్రాన్ని పునఃప్రారంబించారు. ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, కార్యదర్శి శివకుమార్, లక్ష్మీనారాయణ, ఉప్పర రవి, జంబునాథ్ రాయుడు, చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 23: పట్టణంలోని పెద్దబావి సమీపంలోని మద్యం దుకాణాన్ని తొలగించాలని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ పెద్దబావి సమీపంలోని రోడ్డు పక్కనే మద్యం దుకాణం ఉందని, మందుబాబులు రోడ్డుపైనే మద్యం తాగుతుండడంతో మహిళలు, విద్యారినులు దారిలో వెళ్లడానికి భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందించి దుకాణాన్ని పట్టణానికి దూరంగా తరలించాలని కోరారు. వాణి, పద్మ, ఈరమ్మ, శారద పాల్గొన్నారు.

బీచ్ సెపక్ తక్రా పోటీల్లో భారత్ జట్టుకు కాంస్య పతకం

ఆలూరుకు చెందిన మధు ప్రాతినిధ్యం



భారత జట్టుతో క్రీడాకారుడు కురువ మధు

ఆలూరు, సెప్టెంబరు 23: చైనాలోని కింగ్ డావోలో ఆసియా బీచ్ సేపక్‌తక్రా పురుషుల పోటీల్లో భారత జట్టు కాంస్య పథకాన్ని దక్కించుకుంది. ఆలూరుకు చెందిన కురువ మధు భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించారు.. జట్టు విజయంలో ప్రధాన భూమిక పోషించి జట్టు విజయానికి కృషి చేశారు. మధును రాష్ట్ర సెపక్ తక్రా సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.. ఆలూరు ప్రజలు, క్రీడాకారులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.. ఈయనకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొనలేం... తినలేం

పెరుగుతున్న కూరగాయల ధరలు
తినలేమంటున్న వినియోగదారులు



ఆదోని రైతు బజార్‌లో కూరగాయలు కొంటున్న వినియోగదారులు

ధరలు ఇలా..

కూరగాయ	ధర
టమోటా	రూ.35లు
ఉల్లిగడ్డలు	రూ.60లు
బీన్స్	రూ.70లు
ముల్లంగి	రూ.46లు
దొండకాయ	రూ.50లు
క్యారెట్	రూ.56లు
బీరకాయలు	రూ.48లు
బెండకాయలు	రూ.34లు
క్యాలీఫ్లవర్	రూ.40లు
ఆలుగడ్డలు	రూ.44లు
దోసకాయలు	రూ.42లు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 23: రోజు రోజుకి చుక్కల నంటుతున్న కూరగాయల ధరలు ప్రజలను కన్నీరు పెట్టిస్తున్నాయి. బడ్జెట్ మొత్తం చాలక అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

భారీ వర్షాలతో కొరత

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయల కొరత ఏర్పడ్డాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లి టమాటా వంటి అవసరమైన స్థాయిలో సరఫరా కావడం లేదు వర్షాల వల్ల పంట నష్టపోయి దిగుబడి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా పండగలు రావడంతో ధరలకు రెక్కలు వచ్చాయి.

కార్తీక మాసం ముగిసేదాకా ఇంతే..

కార్తీకమాసం ముగిసేదాకా ధరలు దిగిరావేమోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ వారంలో అల్పపీడనంతో భారీ వర్షాలు కురిసే అవకాశముందని సమాచారం. అక్టోబరులో దసరా సందర్భంగా కూరగాయల వినియోగం అధికంగా ఉంటుంది. దీంతో పెరిగే అవకాశముందని ప్రభుత్వం, ఉద్యానవన శాఖ అధికారులు చర్యలు తీసుకుని ధరలు పెరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తినలేని పరిస్థితి



ఒకప్పుడు రూ.వందకు వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు ఒక్క కూరగాయనే రూ.40పైగా పలుకుతోంది. ధరలను నియంత్రించాలి.

- నరసప్ప, వినియోగదారుడు, పెద్ద తుంబళం

ధరలను నియంత్రించాలి



కూరగాయల ధరలను ప్రభుత్వం, అధికారులు నియంత్రించాలి. ఉద్యానవన శాఖ అధికారులు కూరగాయల సాగును ప్రోత్సహిస్తే ధరలు తగ్గుతాయి.

- శాంత కుమార్, వినియోగదారుడు, ఆదోని